క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



అలంపూర్: ఎర్రవల్లికి చెందిన భగవాన్‌జీకి సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.19,500 చెక్కును గురువారం కర్నూలులోని ఎమ్మెల్సీ నివాసంలో ఎమ్మెల్యే విజయుడు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వావిలాల రంగారెడ్డి, నరేందర్ రెడ్డి, పల్లెరాజు, బీచుపల్లి, అంజి ముదిరాజ్, వేణు ఆచారి, వినోద్‌కుమార్ గౌడ్ పాల్గొన్నారు.

ఎస్‌ఏ-2 మార్కులు ఆన్‌లైన్‌లో పొందుపర్చాలి



ధరూరు: ఎస్‌ఏ–2 పరీక్షలకు సంబంధించిన మార్కులను ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని ఎంఈఓ రవీంద్రబాబు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్‌ఏ–2 పరీక్షల నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 23వ తేదీన తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి విద్యార్థుల ప్రోగ్రెస్ కార్డులు అందజేయాలని సూచించారు. అనంతరం కేజీబీవీ పాఠశాలలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు.

ఆలయానికి రూ.లక్ష విరాళం



కేటీదొడ్డి: మండలంలోని వెంకటాపురం కొండపై వెలసిన శ్రీపాగుంట లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయానికి గురువారం కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లాకు చెందిన నామ్ శ్రీనివాస్ శుక్రవారం రూ.లక్ష విరాళం అందజేశారు. ఆలయ ప్రాంగణంలో కల్యాణ మండపం నిర్మాణానికి తనవంతుగా ఆర్థికసాయం అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది ఆయనతో స్వామివారికి ప్రత్యేక పూజలు చేయించి.. శాలువాతో సత్కరించారు.

గొర్లఖాన్‌దొడ్డిలో భూ వివాదం

గట్టు: మండలంలోని గొర్లఖాన్‌దొడ్డి గ్రామంలో భూ వివాదం వ్యవహారం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఈ భూ వివాదంపై రెండు వర్గాలకు చెందిన వారు గట్టు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు చేసినట్లు తెలిసింది. ఇంతటితో ఆగక బాధితులు గద్వాల సీఐ కార్యాలయం వరకు వెళ్లినట్లు సమాచారం. చేనేత కార్మిక కుటుంబానికి చెందిన భూమిని ఇద్దరు రాజకీయ నాయకులు కొనుగోలు చేసి.. ప్లాట్లుగా చేసిన వ్యవహారంలో భూమిని విక్రయించిన దాయాది కుటుంబం తమ అనుమతి లేకుండా తమ భాగాన్ని ఎలా కొనుగోలు చేశారంటూ నిలదీస్తున్న వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. చేనేత కార్మిక కుటుంబాలను రాజకీయ నాయకులు బెదిరింపులకు పాల్పడుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నట్లుగా సామాజిక మాధ్యమాల్లో పేర్కొంటున్నారు. గొర్లఖాన్ దొడ్డి భూ వివాదంపై పోలీసులు మాత్రం ఏ విషయాన్ని చెప్పడం లేదు.

ఫోర్జరీ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

కేటీదొడ్డి: మండల కేంద్రంలో గ్రామపంచాయతీ కార్యదర్శి సంతకాన్ని ఫోర్జరీ చేసి మట్టి మిద్దెను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు బాధిత కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ మేరకు గురువారం ఎంపీడీఓ కృష్ణమోహన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండల కేంద్రానికి చెందిన చాకలి గోవిందు ఇంటిపై తప్పుడు ఓనర్ షిప్ సర్టిఫికెట్ సృష్టించి ఇతరులకు రిజిస్ట్రేషన్ చేశారని తెలిపారు. 2020లో కేటీదొడ్డి పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహించింది ఒకరైతే.. మరొకరి సంతకంతో ఓనర్‌షిప్ సర్టిఫికెట్ జారీ చేశారని ఆరోపించారు. కుటుంబ సభ్యుల ప్రమేయం లేకుండా పంచాయతీ కార్యదర్శి సంతకం ఫోర్జరీ చేసి తప్పుడు ధ్రువపత్రాలతో మట్టి మిద్దెను రిజిస్ట్రేషన్ చేసుకున్నారని.. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై ఎంపీడీఓను వివరణ కోరగా.. విచారణ చేపట్టి పంచాయతీ కార్యదర్శి సంతకాన్ని ఫోర్జరీ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కూడలి.. సమస్యల లోగిలి



ఎర్రవల్లి చౌరస్తా



ఈ చిత్రంలో కనిపిస్తున్న జనం ఏ సినీ హీరో కోసమో లేక.. మంత్రి లేదా ముఖ్యమంత్రి కోసమో ఎదురుచూస్తున్నారని అనుకుంటే పప్పులో కాలేసినట్లే. వీరందరూ ఆర్టీసీ బస్సుల కోసం ఎదురుచూస్తున్నారు. ఇది ఎక్కడో కాదు.. ఎర్రవల్లి చౌరస్తా. జిల్లా కేంద్రమైన గద్వాల, రాష్ట్ర రాజధాని హైదరాబాద్, ఏపీలోని కర్నూలుకు వెళ్లే ప్రయాణికులకు కూడలి ప్రాంతం. ఇక్కడ రోడ్లపై నిలబడి బస్సుల కోసం ఎదురుచూడాల్సిందే. ప్రధాన కూడలిలో కనీస వసతులు లేక అవస్థలు పడుతున్నారు.

- ఎర్రవల్లి చౌరస్తాలో కనీస వసతులు కరువు
- మండుటెండలోనే బస్సుల కోసం ప్రయాణికుల ఎదురుచూపు
- మూత్రశాలలు, మరుగుదొడ్లు లేక మహిళల అవస్థలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



గద్వాలకు వెళ్లేందుకు ఎండలోనే రోడ్డుపై నిలబడిన ప్రయాణికులు

ఎర్రవల్లి: ఎర్రవల్లి చౌరస్తా నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు నిత్యం వేలాది మంది ప్రయాణికులు వస్తుంటారు. ప్రధాన కూడలిలో ప్రయాణికులకు కనీస వసతులు లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా కర్నూలు, హైదరాబాద్, గద్వాలవైపు వెళ్లేందుకు బస్సుల కోసం రోడ్లపైనే ఎదురుచూడాల్సి వస్తుంది. మండుటెండతో పాటు వర్షాలకు తాళలేక ఏదైనా దుకాణం వద్ద నిలబడితే తమ వ్యాపారానికి ఇబ్బంది అవుతుందని దుకాణదారులు చీదరించుకుంటున్నారని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహిళా ప్రయాణికులు, విద్యార్థినుల పరిస్థితి మరీ అధ్వానంగా ఉంది. ఎండలో రోడ్డుపై నిలబడలేక.. నీడకోసం ఎటూ పోలేక సతమతమవుతున్నారు. నిత్యం వేల సంఖ్యలో ప్రజలు ప్రయాణించే కూడలిలో కనీసం మూత్రశాలలు, మరుగుదొడ్లు లేకపోవడంతో మహిళా ప్రయాణికుల బాధలు వర్ణణాతీతం. ఒకప్పుడు గ్రామపంచాయతీగా ఉన్న ఎర్రవల్లి.. ఇప్పుడు మండల కేంద్రంగా మారి 18 నెలలు గడుస్తున్నా కనీస వసతులకు మాత్రం నోచుకోవడం లేదని పలువురు మండిపడున్నారు. చౌరస్తాలో వసతుల కల్పనలో అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం వహిస్తున్నారని వాపోతున్నారు.

వసతుల కల్పనపై కనిపించని శ్రద్ధ..

నిత్యం వేలాది మంది ప్రయాణికులతో రద్దీగా ఉండే ఎర్రవల్లి చౌరస్తాలో ఆర్టీసీ బస్టాండ్ లేకపోవడం పెద్ద సమస్యగా మారింది. ఆర్టీసీకి ఆదాయంపై ఉన్న శ్రద్ధ.. ప్రయాణికులకు మౌలిక వసతులు కల్పించడంలో లేదని పలువురు వాపోతున్నారు. కర్నూలు, హైదరాబాద్, గద్వాలవైపు వెళ్లే ప్రయాణికులకు కనీస వసతులు కల్పించడంపై కనీస దృష్టిసారించడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం తాగేందుకు నీటి వసతి లేకపోవడంతో వాటర్ బాటిల్ కొనుక్కొని తాగే దుస్థితి నెలకొంది. నిత్యం మహిళలు చీర కొంగు, యువతులు చున్నీలు, విద్యార్థులు పుస్తకాలను, ఉద్యోగులు బ్యాగులను నెత్తిన పెట్టుకొని వేడి, వర్షం నుంచి ఉపశమనం పొందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి ఎర్రవల్లి చౌరస్తాలో ప్రయాణికులకు కనీస వసతులు కల్పించాలని కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం..



ఎర్రవల్లి కూడలిలో బస్సుల కోసం మండుటెండలో నిలబడాలంటే ఇబ్బందిగా ఉంది. కనీసం బస్సులు ఆగే దగ్గర ప్రయాణికులకు గుప్పెడు నీడ కూడా లేదు. ఎండను తాళలేక నెత్తిన బ్యాగు పెట్టుకుని నిలబడుతున్నాం. కనీసం ఐదు నిమిషాలైనా కూర్చుందామంటే బెంచీలు లేవు. అధికారులు స్పందించి కనీస వసతులు కల్పించాలి.

– పెద్ద వీరన్న, ప్రయాణికుడు

ఎవరూ పట్టించుకోవడం లేదు..



ఎర్రవల్లి కూడలిలో కనీసం మూత్రశాలలు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని పలుమార్లు జిల్లా అధికారులకు విన్నవించాం. కానీ ఇప్పటి వరకు వారి నుంచి ఎలాంటి స్పందన లేదు. దీంతో నిత్యం ప్రయాణికులు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రయాణికుల సమస్యలను పరిష్కరించాలి.

– జోగుల రవి, మాజీ సర్పంచ్, ఎర్రవల్లి

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

అలంపూర్/మల్దకల్/శాంతినగర్: పశువులకు సీజనల్‌గా వచ్చే వ్యాధులపై పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలని పశువైద్యులు సూచించారు. గురువారం పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. అలంపూర్, క్యాతూర్ గ్రామాల్లో 52 తెల్లపశువులు, 130 గేదెలకు టీకాలు వేసినట్లు వెటర్నరీ డాక్టర్ శంకరయ్య తెలిపారు. కార్యక్రమంలో జేవీఓ శ్రీశైలం, లైవ్ స్టాక్ అసిస్టెంట్లు డి.శాంతి, ఓఎస్ ప్రకాశ్, గోపాలమిత్రలు ఠాగూర్ నాయుడు, ప్రసాద్ గౌడ్ పాల్గొన్నారు.

❒ మల్దకల్ మండలంలోని కుర్తిరావులచెర్వు, పాల్వాయి గ్రామాల్లో 752 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి వినయ్‌కుమార్, ఉష తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది రాజేంద్ర, యుగంధర్‌రెడ్డి, గోవర్దన్, అర్జున్‌సింగ్, రామాంజనేయులు, రాము, రామేశ్వరయ్య, మధు పాల్గొన్నారు.



అలంపూర్‌లో పశువులకు టీకాలు వేస్తున్న వెటర్నరీ సిబ్బంది

❒ వడ్డేపల్లి పురపాలిక పరిధిలోని పైపాడులో 260 తెల్లపశువులు, 564 గేదెలకు వ్యాధినిరోధక టీకాలు వేసినట్లు డాక్టర్ స్వరూపరాణి తెలిపారు. కార్యక్రమంలో వీఎల్‌ఓ వరప్రసాద్, ఎల్ఎస్ఏ లతీఫ్, బుచ్చమ్మ, ఓఎస్‌లు పాలాగు, వెంకటమ్మ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలి



మానవపాడు: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని ఎంపీడీఓ భాస్కర్ అన్నారు. మండలంలోని చంద్రశేఖర్‌నగర్‌లో గురువారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల పథకం పైలెట్ గ్రామంలో లబ్ధిదారులు త్వరగా ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించాలని సూచించారు. ఎంపీడీఓ వెంట పంచాయతీ కార్యదర్శి మంజుల తదితరులు ఉన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ హేమలత

మల్దకల్: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడంతోనే తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సీడీపీఓ హేమలత అన్నారు. గురువారం మండలంలోని నాగర్‌దొడ్డిలో గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ.. గర్భిణులు క్రమం తప్పకుండా ప్రతినెలా వైద్యపరీక్షలు చేయించుకోవడంతో పాటు పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అదే విధంగా బరువు, ఎత్తు తక్కువగా ఉన్న చిన్నారుల ఆరోగ్యంపై అంగన్‌వాడీ టీచర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. అనంతరం చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగరాణి, టీచర్ వనజాక్షి, పంచాయతీ కార్యదర్శి సరిత పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

గద్వాల క్రైం: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. పట్టణ ఎస్ఐ కళ్యాణ్‌కుమార్ వివరాల మేరకు.. మండలంలోని గోనుపాడు గ్రామానికి చెందిన డ్రైవర్ బోయ రామకృష్ణ గురువారం గద్వాలకు ఇసుకను ట్రాక్టర్‌లో అక్రమంగా తరలిస్తుండగా.. ఫ్లైఓవర్ రోడ్డు మార్గంలో పోలీసు సిబ్బంది పట్టుకున్నారు. ఇసుక తరలింపునకు ప్రభుత్వ అనుమతి లేకపోవడంతో అదుపులోకి తీసుకుని డ్రైవర్‌తో పాటు యాజమాని బోయ శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సమ్మెను జయప్రదం చేయండి

గద్వాల: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మే 20న దేశవ్యాప్తంగా తలపెట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వెంకటస్వామి, నర్సింహ కోరారు. గురువారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. దేశవ్యాప్త సమ్మెకు తెలంగాణ రైతు సంఘం సంపూర్ణ మద్దతు తెలిపినట్లు పేర్కొన్నారు.

కుష్టు వ్యాధిని నిర్మూలించడమే లక్ష్యం

మల్దకల్: కుష్టు వ్యాధిని మొదటి దశలోనే గుర్తించి.. పూర్తిస్థాయిలో నిర్మూలించడమే ప్రధాన లక్ష్యమని డీపీఎంఓ నందీశ్వర్ అన్నారు. గురువారం మల్దకల్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఆయన ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మండలంలో కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించి అవసరమైన చికిత్సలు అందించాలని సూచించారు. కుష్టుపై నిర్లక్ష్యం వహిస్తే అంగవైకల్యం కలిగే ప్రమాదముందని ఆయన హెచ్చరించారు. గ్రామాల్లో కుష్టుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు వ్యాధిగ్రస్తులు ప్రతినెలా క్రమం తప్పకుండా మందులు వాడేలా చూడాలని సిబ్బందికి సూచించారు. అనంతరం రోగులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ స్వరూపరాణి, సిబ్బంది జయరాం, నర్సన్న తదితరులు పాల్గొన్నారు.



మందులు పంపిణీ చేస్తున్న డీపీఎంఓ నందీశ్వర్

ఆపత్కాలంలో ఆపన్నహస్తం

గద్వాల: ఆపత్కాలంలో పేదలకు ఆపన్నహస్తం అందిస్తున్నట్లు జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ధరూరు, మల్దకల్ మండలాలకు చెందిన 35 మందికి రూ.15,03,100 విలువైన సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. పేదలకు మెరుగైన వైద్యం కోసం సీఎంఆర్ఎఫ్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజశేఖర్ రెడ్డి, శ్రీనివాసులు, డీఆర్ శ్రీధర్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల సమావేశం



అలంపూర్: పట్టణంలోని కోర్టులో గురువారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పదేళ్లలోపు ప్రాక్టీస్ న్యాయవాదులు ప్రతినెలా రూ.50, పదేళ్ల పైగా ప్రాక్టీస్ న్యాయవాదులు రూ.100 చొప్పున చెల్లించాలని నిర్ణయించినట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసులు తెలిపారు. బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు సురేశ్ కుమార్ ఆధ్వర్యంలో కాస్ట్ అమౌంట్ రూ. 3,950 నగదు వసూలు చేశారని.. ఆ డబ్బులను త్వరగా అందించాలని కోరారు. ప్రస్తుతం కాస్ట్ బుక్ అండ్‌కు రూ. 4,500 చెల్లించినట్లు ఆయన తెలిపారు.

రైతులకు ఉపయోగపడే పనులు చేపట్టండి



మానవపాడులో ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ నర్సింగ్‌రావు

మానవపాడు: ఉపాధి హామీ పథకంలో రైతులకు ఉపయోగపడే పనులు చేపట్టాలని అదనపు కలెక్టర్ నర్సింగ్‌రావు అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. చందాపూర్ గ్రామ శివారులో వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. ఉపాధి హామీ పథకం లక్ష్యాన్ని ప్రణాళికాబద్ధంగా పూర్తిచేయాలన్నారు. కూలీలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పనులు కల్పించడంతో పాటు చేసిన పనులకు సకాలంలో కూలి డబ్బులు అందేలా చూడాలన్నారు. గ్రామాల వారీగా సూక్ష్మ ప్రణాళిక సిద్ధంచేసి.. లేబర్ మొబిలైజేషన్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. అదనపు కలెక్టర్ వెంట ఎంపీడీఓ భాస్కర్, టెక్నికల్ అసిస్టెంట్ మాధవ్ తదితరులు ఉన్నారు.

బాల్యవివాహాలకు అడ్డుకట్ట వేద్దాం



అవగాహన కల్పిస్తున్న నాగరాజు

కేటీదొడ్డి: బాల్యవివాహాలకు అడ్డుకట్ట వేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఫైనాన్షియల్ లీటరసీ నాగరాజు అన్నారు. గురువారం మండలంలోని పాతపాలెంలో ఉపాధి హామీ కూలీలకు బాలల హక్కులు–రక్షణ చట్టాలు, బాలల సంక్షేమ సమితి అందిస్తున్న సేవలు, చైల్డ్‌లైన్, డయల్ 1098, 112, 100 అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాల్యవివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. ఎవరైనా బాల్యవివాహం చేయాలని యత్నిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. బాలల అక్రమ రవాణా, మాదకద్రవ్యాల నిర్మూలనలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో చిట్టెమ్మ, కృష్ణయ్య పాల్గొన్నారు.

రజతోత్సవ సభకు తరలిరావాలి

గట్టు: వరంగల్‌లో ఈ నెల 27న నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు పార్టీ శ్రేణులు భారీగా తరలిరావాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బాసు హనుమంతు నాయుడు, మాజీ జెడ్పీటీసీ బాసు శ్యామల కోరారు. గురువారం మండలంలోని బోయలగూడెం గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు ర్యాలీ నిర్వహించారు. ముందుగా గట్టుపై వెలసిన శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ముఖ్య నాయకులు, కార్యకర్తలతో వారు సమావేశమై మాట్లాడారు. వరంగల్ సభకు గ్రామాల నుంచి పెద్దఎత్తున కార్యకర్తలు, నాయకులు తరలిరావాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ అమలు కాని హామీలను ఇచ్చి, ప్రజలను మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు చక్రధర్, మోనేష్, బస్వరాజు, శేఖర్‌నాయుడు, వెంకటేశ్, గంజిపేట రాజు, బాసు గోపాల్, రామునాయుడు, రాజునాయుడు, నాగరాజు పాల్గొన్నారు.



బోయలగూడెంలో ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

విద్యార్థుల యూనిఫాం క్లాత్ పంపిణీ

ఎర్రవల్లి: కొండేరు ఎమ్మార్సీ భవనంలో గురువారం ఉమ్మడి ఇటిక్యాల మండలంలోని వివిధ పాఠశాలల హెచ్‌ఎంలకు ఎంఈఓలు అమీర్‌పాషా, వెంకటేశ్వర్లు విద్యార్థుల యూనిఫాం క్లాత్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2025–26 విద్యా సంవత్సరానికి గాను 4,367 మంది విద్యార్థులకు అవసరమైన క్లాత్‌ను అందజేసినట్లు తెలిపారు. ఉమ్మడి మండలంలో 1–8 తరగతి వరకు 3,310 మంది, 9–10 తరగతి 943, ఇంటర్ 114 మంది విద్యార్థులు ఉన్నట్లు వివరించారు. స్వయం సహాయక మహిళా సంఘాల ఆధ్వర్యంలో విద్యార్థులకు యూనిఫాం దుస్తులు కుట్టించి సకాలంలో అందజేయాలని ఏపీఎం కుర్మయ్యకు వారు సూచించారు.



యూనిఫాం క్లాత్ పంపిణీ చేస్తున్న ఎంఈఓలు

నోటీసులు ఇవ్వకుండా ఎలా కూలుస్తారు?

- ఆర్టీసీ అధికారులతో మానవపాడు గ్రామస్తుల వాగ్వాదం

మానవపాడు: మండల కేంద్రంలోని ఆర్టీసీ స్థలంలో ఏర్పాటుచేసుకున్న దుకాణాల కూల్చివేత వివాదాస్పదంగా మారింది. గురువారం ఆర్టీసీ డిప్యూటీ రీజినల్ మేనేజర్ ధర్మ, గద్వాల డీఎం సునీత ఆధ్వర్యంలో బస్టాండ్ ఆవరణలో ఉన్న నాగరాజు డబ్బాను జేసీబీ సహాయంతో తొలగించారు. దీంతో గ్రామస్తులు పెద్దఎత్తున అక్కడికి చేరుకుని అధికారులతో వాగ్వాదానికి దిగారు. కొన్నేళ్ల క్రితం షెటర్లను ఏర్పాటుచేసుకుని జీవనం సాగిస్తున్నామని.. ముందస్తుగా నోటీసులు లేకుండా ఎలా కూల్చివేస్తారని ఆర్టీసీ అధికారులను ప్రశ్నించారు. ఆర్టీసీకి చెందిన 16 గుంటల స్థలానికి హద్దులు ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. గ్రామస్తుల ఆందోళన సమాచారం అందుకున్న ఎస్ఐ చంద్రకాంత్ అక్కడికి చేరుకుని నచ్చజెప్పారు. అయితే ఆర్టీసీ స్థలానికి సంబంధించి అద్దె చెల్లింపునకు దుకాణదారులు సమ్మతించడంతో వివాదం సద్దుమణిగింది.



ఆర్టీసి అధికారులతో వాగ్వాదానికి దిగిన గ్రామస్తులు

నిందితులను కఠినంగా శిక్షించాలి

అలంపూర్/అయిజ: అయిజ మండలం బింగిదొడ్డి గ్రామంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫ్లెక్సీపై బురద చల్లిన నిందితులను కఠినంగా శిక్షించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రాజు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గ్రామంలో ఘర్షణ వాతావరణం సృష్టించడానికి ప్రయత్నించే వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

➩ అంబేడ్కర్ ఫ్లెక్సీపై బురద చల్లిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎమ్మార్పీఎస్, అంబేడ్కర్ సంఘం నాయకులు అయిజ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితులపై చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు.

సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు ఘననివాళి



శాంతినగర్: వడ్డేపల్లి మండలం జూలెకల్‌లో గురువారం డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ యువకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. ఉపరాష్ట్రపతిగా, రాష్ట్రపతిగా సర్వేపల్లి రాధాకృష్ణన్ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయానికి వైస్ చాన్స్‌లర్‌గా పనిచేసి.. ఎంతోమంది విద్యార్థులకు మార్గదర్శకంగా నిలిచారని కొనియాడారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ధరూరు: ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన గద్వాల – రాయచూరు రహదారిపై గురువారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. ధరూరు సమీపంలోని పెట్రోల్‌బంక్ వద్ద రాయచూరు రోడ్డు గుంతలమయంగా మారింది. అయితే మాల్‌దొడ్డి గ్రామానికి చెందిన రాముడు గద్వాల వైపు నుంచి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా.. రాయచూరు వైపు నుంచి వస్తున్న బైక్ గుంతల రోడ్డుపై ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో రాముడికి తీవ్రగాయాలయ్యాయి. రాయచూరు వాసికి స్వల్పగాయాలైనట్లు స్థానికులు తెలిపారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ శ్రీహరి తెలిపారు. కాగా, ప్రమాదం జరిగిన తర్వాత స్పందించిన అధికారులు.. రోడ్డుపై ఏర్పడిన గుంతలను కంకరతో పూడ్చివేయించడం గమనార్హం.

సద్వినియోగం చేసుకోవాలి



కేటీదొడ్డి: రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం గోపాల్ అన్నారు. గురువారం మండలంలోని వెంటాపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు రాజేశ్వరి, కోశాధికారి నారాయణమ్మ, మాజీ సర్పంచ్ ఆంజనేయులు పాల్గొన్నారు.